ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 సంచిక : 12 ఆగష్టు 2011

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-05-2011, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవద్గీత సాధన గ్రంథం. సాధన ఎలా చేసుకోవాలో, జీవుడిని ఎలా బాగుచేసుకోవాలో పరమాత్మ వివరంగా చెప్పాడు. జీవుడు పవిత్రుడు అయితేనేగాని హృదయంలో లయంకాడు, ఆత్మాకారం చెందడు. ధర్మాన్ని ఆచరించేవాడికి నార్మల్‌గా, నేచురల్‌గా మనోనాశనం అవుతుంది. మన మనస్సును బాగుచేసుకోకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. శరీరం యొక్క చావు పుట్టుకలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వవద్దు. మీకు వచ్చే కష్టసుఖాలకు మీ మనస్సే కారణం. శరీరం చనిపోయాక ఇతర లోకాలకు ప్రయాణం చేసేది మనస్సే. మీరు ఏదిగా ఉన్నారో ఆ సద్వస్తువు ప్రయాణం చెయ్యదు. మీ మనస్సు శుద్ధి అవ్వకుండా మీరు సత్యవస్తువును తెలుసుకోలేరు. ముందుగా మనస్సును అంటే జీవుడిని బాగుచేసుకోండి. జీవలక్షణాలను పోగొట్టుకోవాలి, అదే నిజమైనసంపద. శరీరం మరణించాక ప్రయాణం చేసేది జీవుడే, కొత్త శరీరాన్ని తొడుక్కొనేది జీవుడే. ఆ జీవుడిని బాగుచేసుకోవటం ఎలాగ దానికి సంబంధించిన సాధన, మెలకువలు చెప్పిన గ్రంథం భగవద్గీత. మనకు ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఉండాలి. అజ్ఞాని ఇంద్రియాలు చెప్పినట్లుగా వినాలి. అలా వినకపోతే అవి ఊరుకోవు. జ్ఞాని చెప్పినట్లుగా ఇంద్రియాలు ఉంటాయి. అదీ అజ్ఞానికీ, జ్ఞానికీ తేడా. శరీరాన్ని ఏమీ పట్టించుకోవద్దు. దానికి ఏదైనా రోగం వస్తే వైద్యం చేయించుకోండి. లోపల మీ జీవుడిని బాగుచేసుకోవటానికి ప్రయత్నం చేయండి.

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు ~ 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ......... 01-05-2011

జిన్నూరు ......... 02-03-2011

గుండుగొలను . 09-05-2011

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

దైవీసంపద అంటే భగవద్గీతలో 26 లక్షణాలు చెప్పాడు. ఆ గుణాలను సంపాదించుకొంటే మీ మనస్సు బాగుపడుతుంది అని పరమాత్మ గీతలో చెప్పాడు. జీవుడు బాగుపడితే వాడు హృదయంలో స్థిరపడి, హృదయంలో కరిగిపోతాడు. అప్పడు హృదయంలో ఉన్న సద్వస్తువు మీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. అదే మన గమ్యం. కాని మనం శరీరానికి ఇచ్చే ప్రాముఖ్యత, భౌతికవిషయాలకు ఇచ్చే ప్రాముఖ్యత మనస్సును పవిత్రం చేసుకోవటానికి ఇవ్వటం లేదు.

**అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః**
**దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్**
**అహింసా సత్యమక్రోధః త్యాగశ్శాన్తి రపైశునమ్**
**దయాభూతేష్వలోలత్వం మార్ధవం హ్రీర చాపలమ్**
**తేజః క్షమా ధృతిశ్శౌచం అద్రోహో నాతిమానితా**
**భవన్తి సంపదం దైవీం అభిజాతస్య భారత!**

**అభయం -** నువ్వు భయపడకుండా ఉండటం నేర్చుకో. సర్వసాధారణంగా చనిపోయవరకు ప్రతీ మనిషిని పీడించేది భయం. ఎక్కడ భయం ఉందో అక్కడ ఆందోళన ఉంటుంది, అశాంతి ఉంటుంది. రకరకాల కారణాల వలన భయం వస్తుంది. రోగం అంటే భయం, చావు అంటే భయం, పేదరికం వస్తుందేమో అని భయం, భవిష్యత్ ఎలా ఉంటుందో అని భయం, ఇంట్లోవారు చూడరేమో అని భయం ఇలా అనేక రకాలుగా భయం వస్తుంది. ఇలా మీరు ప్రతీ చిన్న విషయానికి భయపడుతూ ఉంటే మీకు సాధన సాగదు, మనస్సు అంతర్ముఖం అవ్వదు. అందుచేత అభయం అంటే భయం లేకుండా జీవించటం నేర్చుకోండి. నువ్వు ఇతరులను భయపెట్టవద్దు, ఇతరులను చూసి భయపడవద్దు అని గీతలో చెప్పాడు.

**సత్వసంశుద్ధిః -** సత్వసంశుద్ధి అంటే త్రికరణశుద్ధి. మనం పుణ్యం చేసినా, పాపం చేసినా శరీరం, మాట, మనస్సు ఇవే కారణం. అందుచేత ఈ మూడూ మీరు నియమించుకోవటమే తపస్సు. 1. శారీరక తపస్సు అంటే శరీరంతోటి చేసేది. నియమములన్నింటిలో సాధనకు పనికివచ్చేది ఆహార నియమం అని భగవాన్ చెప్పేవారు. తిండి దగ్గర బహుజాగ్రత్తగా ఉండాలి. తిండి దగ్గర మనం జాగ్రత్తగా ఉంటే మన మనస్సు, ఇంద్రియాలు మనకి స్వాధీనంలోకి వస్తాయి. గృహస్థాశ్రమంలో ఉండి మీరు సన్యాసులుగా ఉండాలి అనుకుంటే రుచికోసం తినవద్దు. మీ దేహానికి ఎంత అవసరమో అంతే తినండి.

రుచిగా ఉందని ఎక్కువ తినవద్దు. ఆహారం దగ్గర నియమంగా ఉండాలి. నువ్వు తినే ఆహారం సాత్వికంగా ఉండాలి. ఇదంతా శారీరక తపస్సు. 2. వాక్కు తపస్సు అంటే నీ మాట శుచిగా ఉండాలి. మాట ఎప్పడూ పరుషంగా ఉండకూడదు, సౌమ్యంగా ఉండాలి. మీరు ఇతరులకు ఏదైనా చెప్పేటప్పడు మీ గొప్పకోసం చెప్పకూడదు. వాళ్ళ బాగుకోసమే మీరు చెబుతున్నారని వాళ్ళకి అర్థమవ్వాలి, వినేవాళ్ళకి హితవుగా ఉండాలి. మీరు పదిసార్లు ఆలోచించి ఒకమాట మాట్లాడండి. మనం ఏమి చేస్తాము అంటే ముందు మాట్లాడతాం. తరువాత ఆలోచిస్తాము. అదికాదు ముందు ఆలోచించండి, తరువాత మాట్లాడండి. ఆ మాట మీకు ఉపయోగపడుతుంది, ఇతరులకు ఉపయోగపడుతుంది. 3. మానసిక తపస్సు అంటే మనస్సుని ఎండింపచేయటం. వాసనని బట్టి తలంపు వస్తుంది, వాసన లేకపోతే తలంపు రాదు. ఆ వాసనను ఎండింపచేయటమే తపస్సు. ఏ రకమైన వాసన ఉందో నువ్వు చూచుకుని ఆ వాసనలోంచి బయటపడటానికి సాధన చేస్తూ ఉంటే ఆ వాసన పలచబడుతూ ఉంటే నీకు చెడు ఆలోచనలు కూడా తగ్గిపోతూ ఉంటాయి. మన మనస్సుని బట్టి మాట వస్తుంది, మాటని బట్టి పని చేస్తాం. అందుచేత నీ మనస్సును బాగు చేసుకున్నావు అనుకో నీ వాక్కు బాగుపడుతుంది, నీ చేత బాగుపడుతుంది అదీ తపస్సు. త్రికరణ శుద్ధి లేని ప్రతీవాడికి వక్రబుద్ధి ఉంటుంది. ఆ వక్రబుద్ధి ఉన్నవాడు పులులు, సింహాలతోటి సమానం అన్నారు.

**జ్ఞానయోగ వ్యవస్థితిః** - జ్ఞాన నిష్టలో ఉండటం. గడ్డిమేటు ఎంత పెద్దది అయినా ఒక్క అగ్గిపుల్ల వేస్తే అంతా కాలిపోతుంది. అలాగే మీకు ఆత్మజ్ఞానం కలిగితే మీలో ఉన్న కర్మలు అన్నీ కాలిపోతాయి. మనం ఎలా ప్రవర్తిస్తే మనకి జ్ఞానం వస్తుంది, ఎటువంటి సాధన చేస్తే మనకి జ్ఞానం వస్తుంది, మీకు ఏ లక్షణాలు ఉంటే జ్ఞానం వస్తుంది. అవన్నీ తెలుసుకుని ఆ లక్షణాలయందు మీరు నిష్టగా ఉంటే మీకు జ్ఞానం కలుగుతుంది.

**దానం** - దానం అంటే కేవలం డబ్బు ఇవ్వటం ఒకటే దానంకాదు. ఆకలిగా ఉన్న వారికి మీరు అన్నం పెట్టారు అనుకోండి, ఒక చదువురానివాడికి చదువు చెప్పారు అనుకోండి, ఎవరైనా భయపడేవాళ్ళకి నీకు నేను ఉన్నాను భయపడకు అని ధైర్యం చెప్పారు అనుకోండి, మీరు అవసరమైనప్పడు ఒక మనిషికి మాటసాయం చేసారనుకోండి ఇవన్నీ కూడా దానం కిందే వస్తాయి. గంగానది ప్రక్కన నూతులు తవ్వటం ఎందుకు? ఎవరు ఎక్కడ ఇబ్బంది పడుతున్నారో జాగ్రత్తగా పరిశీలించి అక్కడ సహాయం చెయ్యాలి అన్నాడు స్వామి వివేకానంద.

అది పరిశీలించకుండా దానాలు చేయటం మంచిది కాదు. దానివల్ల నీకు చెడ్డే వస్తుంది కాని మంచిరాదు. అపాత్రదానం చేయకూడదు. నువ్వు ఏ మంచి చేసినా అది దానం కిందే వస్తుంది. దాని వల్ల అంతఃకరణశుద్ధి అవుతుంది.

**దమశ్చ** - దమం అంటే బాహ్య ఇంద్రియనిగ్రహం. ఇంద్రియనిగ్రహం లేకుండా, మనోనిగ్రహం లేకుండా ఎవ్వరికీ ఆత్మజ్ఞానము సాధ్యముకాదు. సాధకులు ఫలావులు అవీ తినకూడదు. ఆహారనియమం లేకుండా ఇంద్రియనిగ్రహం రాదు.

**యజ్ఞం** - యజ్ఞం అంటే అగ్నిహోత్రంలో నెయ్యివెయ్యటం, మనకి కనపడని దేవతల్ని సంతృప్తిపరచటం యజ్ఞం అనుకుంటున్నారు. యజ్ఞం అంటే నువ్వు ఒక మనిషిని స్వార్థం లేకుండా ప్రేమించగలిగినా అది యజ్ఞం. మీ ఇంట్లో మంచం పట్టినవాళ్లని అగౌరపరచకుండా వాళ్లకి టైముకి భోజనం పెట్టటం యజ్ఞం. మీరు రాముడిని, కృష్ణుడినీ అరాధిస్తున్నారుకదా, అలాగ మీ ఇంట్లో ఉన్న పెద్దలని ఆరాధించండి. వారికి సేవ చేయండి, సత్పురుషులని గౌరవించండి, సత్పురుషులని గౌరవించి వారితోటి సహవాసం చెయ్యటం వలన మీకు ఆత్మజ్ఞానం సంపాదించాలనే బుద్ధి కలుగుతుంది. ఇవి అన్నీ కూడా యజ్ఞమే. యజ్ఞం వలన లాభం ఏమిటి అంటే శరీరం చనిపోయిన తరువాత ఏ జీవుడు అయితే ప్రయాణం చేస్తాడో ఆ జీవుడు బాగుపడతాడు. ఆ జీవుడు బాగుపడితే మీరు ఇంక శవాలను మోయనక్కరలేదు.

**స్వాధ్యాయం** - శాస్త్రం అధ్యయనం చెయ్యటం. ఏ గ్రంథం కనబడితే ఆ గ్రంథం చదవటం అధ్యయనం కాదు. మీ మనస్సు బాగుపడే గ్రంధాలు, మీ మనస్సు అంతర్ముఖం అయ్యే గ్రంథాలు, మీకు జ్ఞానం పట్ల అపేక్ష కలగజేసే గ్రంధాలు చదవాలి. మీరు మంచి గ్రంధాలు చదివితే బాగుపడతారు అని ఇతరులకు చెప్పటం కూడా స్వాధ్యాయ యజ్ఞం.

**ఆర్జవం** - ఋజు ప్రవర్తన (కపటము లేకుండుట). మనం సహజంగా జీవించాలి కాని అసహజంగా జీవించకూడదు. నీలోపల లేనిది బయటకు ఉన్నట్లుగా నటించవద్దు. నీలోపల మంచితనం లేదు అనుకో అందరూ నన్ను మంచివాడు అని చెప్పకోవాలి అని అనుకోవద్దు. ఇతరుల గొడవ నీకు అనవసరం. నీకు బాగుపడే లక్షణాలు ఏమున్నాయి, పాడైపోయేలక్షణాలు ఏమున్నాయి అని చూసుకుని పాడైపోయే లక్షణాలను తగ్గించుకో. నీకు ఉన్న సంపద ఏమిటో చూసుకో. నీకు దైవీసంపద ఉంటే దానిని అభివృద్ధి చేసుకో. దైవీసంపద లేదు అనుకో నాకు లేదు అని అనుకోవద్దు, కష్టపడి సంపాదించుకో. మన

మాట కృత్రిమంగా ఉండకూడదు. మాట సరళంగా ఉండాలి.

**అహింస** - మనం మాట్లాడేటప్పడు ఎదుటివారిని నొప్పించకుండా మాట్లాడాలి. ఎదుటివారికి బాధకలిగేటట్లు మాట్లాడితే అది హింస. ఎదుటివారితో మనం మాట్లాడేటప్పడు విషయం చెప్పాలి. వారికి విషయం అర్థమవుతూ ఉండాలి, వారిని నొప్పించకుండా మాట్లాడాలి. ఇతరులను నొప్పించి మాట్లాడటం వలన పాపం వస్తుంది. శారీరకంగా కాని, మానసికంగా గాని ఇతరులను బాధ పెట్టటానికి ప్రయత్నించకు, అవసరమైతే ఎంతోకొంత నువ్వు బాధపడు కాని ఇతరులను బాధపెట్టకు. మన మాటద్వారా కాని, చేత ద్వారా కాని హింస పనికిరాదు. మంచిగంధపు చెట్టును గొడ్డలి పెట్టి నరుకుతూ ఉంటే గొడ్డలి నరుకుతోంది అని దాని మీద ద్వేషం పెట్టుకోకుండా ఆ చెట్టులో ఉన్న సువాసనను గొడ్డలికి ఇస్తుంది. ఎందుచేత అంటే అక్కడ సువాసన తప్ప దుర్వాసన లేదు, సత్పురుషులు కూడా అంతే. మనం సత్పురుషుడిని హింస పెట్టినా వాడు మనకు మంచినే ఇస్తాడు ఎందుచేతనంటే అక్కడ మంచితనం తప్పించి చెడ్డ ఏమీ లేదు.

**సత్యం** - శరీరం, వాక్కు, మనస్సులతో అసత్యము చెప్పకుండుట. నిజం కూడా అప్రియంగా ఉంటే అది చెప్పకూడదు. ప్రియంగా ఉంటే చెప్పాలి. అది కూడా హితవుగా, వారు బాగుపడేవిధానంగా చెప్పాలి. ఇది అంతా వ్యవహారిక సత్యం. నీ శరీరం ఎంత నిజమో, ఈ లోకం ఎంత నిజమో, ఈ చావుపుట్టుకలు ఎంత నిజమో ఈ వ్యవహారిక సత్యాలు కూడా అంతే నిజం. అసలు సత్యానికి వ్యవహారికసత్యానికి ఏమీ సంబంధము లేదు. సత్యవస్తువు అగు పరమాత్మయందు నిలకడ కలిగి ఉండాలి.

**అక్రోధః** - క్రోధము చాలా చెడ్డ గుణము. మనం ప్రతీ చిన్న విషయానికీ కోపం తెచ్చుకుంటే మనమే నష్టపోతాము. మీ కోరికలు అన్నీ నెరవేరిపోతున్నాయి అనుకోండి మీకు తెలియకుండ గర్వం వచ్చేస్తుంది. మీ కోరికలు నెరవేరటం లేదు అనుకోండి కోపం వస్తుంది. ఎక్కువ కోపం వచ్చేవాడికి బుద్ధి పాడైపోతుంది, మరుపు ఎక్కువ వచ్చేస్తుంది. నీకు వెయ్యి కోట్ల ధనం ఉంది అనుకో నీ బుద్ధి పాడైపోయాక నువ్వు ఆ డబ్బు ఏమి చేసుకుంటావు. మీరు ప్రతీ చిన్న విషయానికీ కోపం తెచ్చుకుంటూ ఉంటే ఆధ్యాత్మికంగానే కాదు భౌతికంగా కూడా నష్టపోతారు. మీ కోపమే మీకు శత్రువు. అందుచేత ప్రతీ చిన్న విషయానికి మీరు ఉద్రేకపడకండి.

**త్యాగః** - నువ్వు కానిదానితోటి తాదాత్మ్యం పొందకుండా ఉండటమే త్యాగము. త్యాగి

కానివాడు జ్ఞానికాలేడు అని రామకృష్ణ పరమహంసగారు అన్నారు. త్యాగం అంటే ఎవరికో నువ్వు పది మామిడి పళ్ళు ఇవ్వటంకాదు. అది బాహ్యవిషయం. నువ్వు ఏదైతే కాదో అది అవును అనుకుంటున్నావు. కానిదానిని విడిచిపెట్టటమే త్యాగం. మీరు గౌరవం ఆశించకుండా, గుర్తింపులు ఆశించకుండా ఆ పని మంచిది అనుకుంటే చేసి వదిలేయటమే త్యాగం. పని చేసి వదిలేయటమే కాదు పని చేసి మర్చిపోవాలి అది కూడా త్యాగం.

**శాంతిః** - శాంతి అంటే మీరు అనుకున్న పనులు అన్నీ అయిపోతూ ఉంటే శాంతిగానే ఉంటారు. అది కాదు సౌభాగ్యంతోటి, దౌర్భాగ్యంతోటి సంబంధం లేకుండా మీరు శాంతిగా ఉండగలిగితే అది నిజమైన శాంతి. శాంతచిత్తం గలవాడు ఎక్కువ అదృష్టవంతుడు. ఎవరికైతే శాంతచిత్తం ఉందో వారికి ఏకాగ్రత కుదురుతుంది, ధారణ ఎక్కువ జరుగుతుంది, జ్ఞాపకశక్తి ఎక్కువ ఉంటుంది. శాంతచిత్తం ఉన్నవాడికి చదువు బాగా వస్తుంది.

**అపైసునమ్** - అపైసునమ్ అంటే రంధ్రాన్వేషకులుగా ఉండవద్దు. కొంతమందికి వాడి తప్పలు వాడికి తెలియవు. ఎదుటివారిని వాడు ఆ తప్ప చేసాడు, వీడు ఈ తప్ప చేసాడు అని చెబుతూ ఉంటారు. వారు తప్ప చేస్తే నీకు సంబంధం ఏమిటి? వాడికి శిక్ష భగవంతుడు ఇస్తాడు. మీరు రంధ్రాన్వేషణ వదిలేయండి అన్నా వారు వదలరు అటువంటి వాళ్ళు పాడైపోతారు. ఎదుటివాళ్ళలో నీకు ఏ దోషం కనిపించినా ఆ దోషం నీ లోపల కూడా ఉంది, నీలోపల ఆ దోషం లేకపోతే ఇతరులలో దోషం నీకు కనిపించదు అన్నాడు. ఎదుటివారిలో తప్పలు ఉంటే నీకు ఎందుకు? నువ్వు బాగుపడే విధానం చూసుకో. చాలామందికి కొండాలు చెప్పే అలవాటు ఉంటుంది. అంటే ఇక్కడ మాటలు అక్కడ, అక్కడి మాటలు ఇక్కడ చెపుతారు. కొండాలు చెప్పే అలవాటు మీకు ఉంటే ప్రయత్నం చేసి దానిని పోగొట్టుకోండి.

**దయాభూతేషు** - జీవకోటి పట్ల దయ కలిగి ఉండటం. జీవకోటికి మీరు ఏదైనా సహాయం చేయగలిగితే చేయండి, చేయలేకపోతే ఊరుకోండి. కాని ఎవరినీ ఆక్షేపించవద్దు. కుంటి వాడిని పేరుపెట్టి పిలవాలి కాని కుంటోడు, కుంటోడు అని పిలవకూడదు. అలా పిలిస్తే రాబోయే జన్మలో మనకి కుంటికాలు వస్తుంది. జీవకోటిపట్ల నువ్వు సానుభూతి కలిగి ఉంటే నీ జీవుడు బాగుపడతాడు. ఆర్థికంగా వెనుకబడిన వారిని, సంసారంలో కష్టాలు అనుభవించే వారిని చూచి ఒకవేళ వారికి సహాయం చేయలేకపోయినా ఎవరి హృదయం అయితే తపిస్తుందో వాళ్ళే ఈ ప్రపంచంలో నిజమైన మహాత్ములు అన్నాడు వివేకానందుడు.

మీరు ఎవరికైనా సేవ చేస్తూ ఉంటే అది సేవ అనుకోకండి. అది పూజ అనుకోండి. అలా చేస్తే మనకి అహంకారం తగ్గుతుంది.

**అలోలత్వం** - విషయాలు ఎదురుగుండా ఉండాలి, ఇంద్రియాలకు చాపల్యం రాకూడదు. మీరు ఎన్ని భోగాలు అనుభవించాలంటే అన్ని భోగాలకి సరిపడవస్తువులు అక్కడ కనిపిస్తున్నప్పటికీ మీ ఇంద్రియాలలో చాపల్యం లేకుండా చూచుకోండి. అప్పుడు మీరు బాగుపడతారు. అది నేర్చుకోండి.

**మార్దవం** - మృదుత్వము కలిగియుండవలెను. మాట మృదువుగా ఉండాలి. కొంతమంది ఎంతసేపు మాట్లాడినా వినసొంపుగా ఉంటుంది, సాఫ్ట్‌గా ఉంటుంది. మన ప్రవర్తన సాఫ్ట్‌గా ఉండాలి, మృదువుగా ఉండాలి. మీరు ధర్మవిరుద్ధమైన పనులు చేస్తూ ఉంటే, మీ ప్రవర్తన మీకు తెలుస్తుంది కదా అప్పుడు మిమ్మల్ని చూచి మీరే సిగ్గుపడాలి. ఏమిటి మన ప్రవర్తన ఇలా ఉంది అని మీరు తిరగేసుకొంటూ ఉంటే మీకు బాగుపడే లక్షణాలు వస్తాయి.

**హ్రీః** - అంటే సిగ్గు. పాపకార్యములు చేయుటయందు సిగ్గుకలిగి యుండవలెను. మహనీయులను, భక్తులను చూచి వారి ప్రవర్తన ఎలా ఉంది, మన ప్రవర్తన ఎలా ఉంది అని చూచుకుని సిగ్గుపడి ఆత్మజ్ఞానము పొందుటకు పట్టుదలతో మనం ప్రయత్నం చేయాలి.

**అచాపలమ్** - చపలత్వము లేకుండుట. మనస్సును ఆత్మయందు నిలబెట్టి ఉంచాలి.

**తేజః** - ప్రతిభ. మీ పిల్లలకి డబ్బులు ఇస్తే సరిపోదు, తెలివితేటలు, వివేకం నేర్పండి. మీరు తెలివితేటలు నేర్పకుండా మీ పిల్లలకు డబ్బు ఇస్తే ఆ డబ్బు అంతా పాడు చేసేస్తారు. భవిష్యత్తులో డబ్బులేనివాళ్ళు బతకగలరుకాని, తెలివితేటలు లేనివాళ్ళు బతకలేరు. మీ పిల్లలకు ప్రతిభ నేర్పండి, జ్ఞానం నేర్పండి, వివేకం నేర్పండి. ఏ మనిషిని ఎలా చూడాలో, ఆ మనుషుల్లో ఉన్న తేడా కూడా వాళ్ళు గ్రహించాలి, ఎవరు మనకి ఉపయోగపడతారు, ఎవరు మనకు ఉపయోగపడరు అని విడదీసుకునే శక్తి మీరు పిల్లలకు నేర్పితే వాళ్ళు కష్టాలలో పడరు. వాళ్ళకి వివేకం, తెలివితేటలు నేర్పకపోతే మీ పిల్లలు చిక్కుల్లో పడిపోతారు అని పరమాత్మ చెబుతున్నాడు.

**క్షమః** - ఓర్పు, సహనము. మీకు పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, మిమ్మల్ని అగౌరవపరచే వారు ఉన్నా ఓర్పుని మీరు విడిచిపెట్టకండి. పరిస్థితులు నీకు అనుకూలంగా లేకపోయినా నువ్వు సహనంగా ఉండగలిగితే నీ హృదయం యొక్క లోతులు పెరుగుతాయి.

ఆత్మజ్ఞానానికి నీలోతు హృదయం నీకు సహకరిస్తుంది.

**ధృతిః** - ధైర్యము. మీకు ఎన్ని కష్టాలు వచ్చినా ముందు ధైర్యము విడిచిపెట్టకండి. మీరు కష్టాలను భరించటం నేర్చుకోండి. మీ దేహం యొక్క ప్రారబ్దాన్ని శాంతిగా, సుఖంగా, ధైర్యంగా మీరు అనుభవించగలిగితే ఈ ప్రారబ్ధం రాబోయే జన్మలో రాదు. అనుభవించటం ఎలాగు తప్పదు కనుక సహనంగా, ఇష్టంగా అనుభవించండి.

**శౌచం** - శుద్ధిగా ఉండటం. మీరు మీ శరీరాన్ని శుద్ధిగా ఉంచటానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నారో అలా దైవాన్ని ప్రార్థిస్తూ, దైవాన్ని ధ్యానిస్తూ మీ మనస్సును, బుద్ధిని శు చిగా ఉంచండి.

**అద్రోహః** - ఎవరిపట్ల వైరభావం లేకుండుట. మీకు ఎవరైనా అపకారం చేస్తున్నారనుకోండి వారితోటి స్నేహం మానేయండి కాని వాడు మన శత్రువు అనే భావం పెట్టుకోవద్దు. మీరు వైరభావం పెట్టుకుంటే మీ మనస్సు బాహ్యముఖం అయిపోతుంది.

**నఅతిమానితా** - కొంతమందికి పొగడ్తలు అంటే ఇష్టం. అందరూ మనలని గౌరవించాలి, ఇతరులు కంటే మనలో ఏదో గొప్పతనం ఉంది, అందరూ మనల్ని మెచ్చుకోవాలి అనే బుద్ధిని విడిచిపెట్టేయండి. అసలు అటువంటి భావన రానివ్వకండి. దాని వలన మీకు వ్యక్తీభావన పెరుగుతుంది, ఉన్న వివేకం తగ్గిపోతుంది. మిమ్మల్ని ఎవరైనా పొగడటం మొదలు పెట్టారనుకోండి ఆ ధోరణి మార్చేయండి, ఇంకో ధోరణిలో పెట్టేయండి. మీరు పాయసం తిన్నట్టు ఆ మాటలు వినకండి, అవి వింటే మీకు వ్యక్తిభావన పెరిగిపోతుంది.

ఈ 26 లక్షణాలు దైవీధనం. దేవుడి దగ్గరకు తీసుకువెళ్ళేధనం ఇది. మీకు ఉన్న డబ్బు మీ శరీరానికి సంబంధించిన అవసరాలు నెరవేరుస్తుంది అది భౌతిక ధనం. కానీ ఈ దైవీధనం మిమ్మల్ని దేవుడి పాదాల దగ్గరకు చేర్చి మీకు మోక్షాన్ని ప్రసాదిస్తుంది. ఈ ధనం మీకు ఉంటే మంచిదే లేకపోతే లేదు, లేదు అనుకోకండి. హోల్ కంపెనీ చేసి దైవీధనాన్ని సంపాదించుకోండి. అందుచేత భగవద్గీత సాధనా గ్రంథము.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-03-2011, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శివరాత్రి అంటే శివుడు లింగరూపం ధరించిన రోజు. ఈ రోజున సాంప్రదాయం ఏమిటి అంటే పగలు ఆహారం ఏమీ తీసుకోకుండా, రాత్రి జాగరణ చేసి శివనామంతో గడిపితే వారు పవిత్రులవుతారు. శివుడు మనకు మొదటి గురువు. లింగం

సాకారముకాదు, నిరాకారము కాదు, సాకారానికి నిరాకారానికి మధ్యన ఉన్న మూర్తి. మనం లింగరూపాన్ని ఆధారంగా చేసుకొని శివస్వరూపాన్ని అంటే ఆత్మస్వరూపాన్ని అందుకోవటానికి దానిని గుర్తుకింద అక్కడ పెట్టారు, దానిని శివుడికింద మనం ఆరాధిస్తున్నాము. పరమాత్మ నిరాకారుడు, నిర్గుణుడు. ఆ నిరాకారుడిని, నిర్గుణుడిని ఒకేసారి మనం అందుకోలేము. మెట్లమీద నుండి మేడపైకి వెళ్ళటానికి ఒకోమెట్టు, ఒకోమెట్టు ఎక్కి ఎలాగ పైకి వెళతామో అలాగ నెమ్మదిగా సాధన చేసుకుంటూ, సాధన చేసుకుంటూ ఆ నిరాకార, నిర్గుణస్థితికి వెళ్ళాలి.

పూర్వం మహారాజులు అందరూ కొన్ని సద్గుణాలను ఆచరించేవారు. సత్యం, అహింస, దొంగబుద్ధి లేకుండా ఉండటం, పారిశుధ్యం, ఇంద్రియనిగ్రహం వీటిని పంచమహాగుణాలు అనేవారు. ఈ గుణాలను ప్రాక్టీసు చేసేవారు. అహింస అంటే కేవలం మాంసాహారం తినకపోవటంకాదు, ఇతరులను మాట ద్వారాగాని, చేతద్వారాగాని హింసపెట్టకూడదు. ఇతరులను హింసపెట్టాలనే బుద్ధి మనకు ఎక్కువగా ఉంటుంది, దానిలోనుండి విడుదల పొందటానికే అహింసా సిద్ధాంతం తీసుకొని వచ్చారు. ఇతరుల ఇంటికి వెళ్ళి సొత్తు దొంగిలించటమే దొంగతనం కాదు, మనకు అవసరంలేని వస్తువులను పోగుచేసుకోవటం కూడా ఒకరకమైన దొంగబుద్ధి. కొంతమంది అవసరంలేని వస్తువులన్నీ నొల్లుకుంటారు, అక్కడ నుండి నెమ్మదిగా దొంగబుద్ధి ప్రారంభమవుతుంది. పారిశుధ్యానికి కూడా మన పూర్వీకులు చాలా ప్రాముఖ్యత ఇచ్చారు. అంటే మనకు లోపల పారిశుధ్యం, బయట పారిశు ధ్యం రెండూ ఉండాలి. ఆత్మజ్ఞాన సముపార్జన చేయటానికి మనకు ధనం ఉందా లేదా, చదువు ఉందా లేదా అనేవి ముఖ్యం కాదు, మనకు ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఎంతవరకు ఉన్నాయి అనేది ముఖ్యం. ధనం వలన మదం వస్తుంది. ధనాన్ని నిగ్రహించుకొనే శక్తి మనకు లేకపోతే ఆ ధనమే మదంకింద మారిపోయి శుభ్రంగా లోపల కుళ్ళిపోతారు.

ఈశ్వరానుగ్రహం లేకుండా ఎవరికీ ఐశ్వర్యం కలుగదు. మనకు ఉన్న ఐశ్వర్యాన్ని ఈశ్వర ప్రసాదంగా తీసుకోవాలి కాని అది మన సొంతం అనుకోకూడదు. కాళిదాసు ఏమని చెప్పాడు అంటే రఘువంశరాజులు కష్టపడి సంపాదించారు, వారికోసం సంపాదించలేదు, ఇతరులకోసమే కష్టపడి సంపాదించారు. రఘువంశ మహారాజులు గుఱ్ఱాల్లాగ పనిచేసారు, సన్యాసులుగా జీవించారు అని చెప్పాడు. అలా జీవించేవారు బాగుపడతారు, మోక్షం పొందటానికి వారికి అర్హత, యోగ్యత కలుగుతుంది. మహావిష్ణువు పాలసముద్రంలో సర్పం మీద నిద్రపోయేవాడు, శివుడి మెడలో సర్పం ఉంటుంది. ఆయన

మహావిష్ణువు, ఈయన మహాదేవుడు. సర్పాలమధ్యన వారు అంత శాంతిగా ఉంటే, మనం చిన్న కష్టంవస్తే భరించలేకపోతున్నాము అంటే మనకు సహనం లేదని అర్థం. ఆత్మకామం అంటే వారికి ఆత్మజ్ఞానం పొందాలనే కోరిక తప్ప ఇంక ఏమీ ఉండదు, వారి మనస్సు ఆత్మ చుట్టూ తిరుగుతూ ఉంటుంది, అనాత్మగొడవ వారికి ఉండదు, అనాత్మ వస్తువులమీద వారి మనస్సు వాలదు. ఆత్మ కామం ఉన్నవారినే ఆత్మ వరిస్తుంది, వారికి మాత్రమే ఆత్మ తెలియబడుతుంది.

ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అని నోటితో చెపితే ఏముంది. అద్వైతం అనుభవంలోనికి రావాలి. నోటితో చెప్పటం వలన, పుస్తకాలలో చదవటం వలన దాని వైభవం మీకు తెలియదు, అది లోపల ఎలా ఉందో మీకు తెలియదు. అద్వైతానుభవం పొందినప్పుడు దాని యొక్క సౌందర్యం మీకు తెలుస్తుంది, అందులో ఉన్న ఆనందం మీకు తెలుస్తుంది కాని వట్టి మాటల వలన ఏమీ ప్రయోజనం లేదు. శివుడు మొదటి ఆచార్యుడు, ఆయనే ఆత్మరూపంలో మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు. మనం చూసే ఈ ప్రపంచంలో నుండి, మనం కాని విషయాలలో నుండి మనలను విడదీసి, ఈ పంచభూతాలను, దేహబుద్ధిని, అహంభావనబుద్ధిని మనచేత ఓవర్‌కమ్ చేయించి లోపలఉన్న సద్వస్తువును మనకు పట్టి ఇచ్చే వాడే శివుడు, వాడే ఆచార్యుడు, వాడే గురువు. గురువు అనుగ్రహం లేకుండా ఎవడికీ ఆత్మజ్ఞానం కలుగదు. ఆచార్యుడు ఏమి చేస్తాడు అంటే శాస్త్రాలను మీకు బోధిస్తూ, వాడు చెప్పింది మీకు అందుతోందో లేదో చూసుకొంటూ ఉంటాడు. వాడు ఆచారంగా ఉంటాడు. మీరు అనాచారంగా ఉంటే మిమ్మల్ని ఏమీ అనడు, మీకు విద్యను బోధిస్తూ మీకు తెలియకుండా మిమ్మల్ని అనాచారంలో నుండి బయటకు తీసుకొని వస్తాడు, వాడు ఆచార్యుడు.

ఆచార్యుడికి చదువు ఉండాలి, గురువుకు చదువు అక్కరలేదు. రామకృష్ణ పరమహంసను గురువు అంటారు. ఆయనకు చదువు లేదు, దగ్గర కూర్చోపెట్టుకొని ఉపనిషత్తులు అవీ చెప్పే శక్తి ఆయనకు లేదు. అయినప్పటికీ ఉపనిషత్తుల సారం అంతా ఆయనకు అనుభవంలో ఉంది కాబట్టి, వేదజ్ఞానం అంతా ఆయనకు అనుభవంలో ఉంది కాబట్టి, ఆయన తరించాడు కాబట్టి మీపట్ల దయ చూపించి మిమ్మల్ని తరింపచేయటానికి మాటలు చెప్పి, మీకు మంచి అలవాట్లు కలుగజేసి మీకు సహకారం అందించేవాడు, ఆయన అనుగ్రహస్వరూపుడే. అనుగ్రహం దగ్గరకు వచ్చేటప్పటికి గురువు, ఆచార్యుడు సమానమే.

శివుడు గురువుగా, ఆచార్యుడుగా అన్ని పాత్రలు పోషించగలడు. శివుడు అంటే సత్యం, శివుడు అంటే శాంతి, శివుడు అంటే మంగళం, శివుడు అంటే జ్ఞానం, నిరాడంబరానికి గుర్తు. అన్ని శక్తులు ఉన్నప్పటికీ ఏమీ ఆడంబరం కనబడదు. ఈశ్వరానుగ్రహం లేకుండా మనకు అద్వైతానుభవం రాదు. ఒకసారి శంకరాచార్యులవారు ఏమన్నారు అంటే ఓ శంకరా! నేను దేశమంతా తిరుగుతున్నాను, నేను దేశ సంచారం చేస్తున్నాను అని అనుకోవటం లేదు నీ ప్రదక్షిణమే చేస్తున్నాను అనే భావనతో తిరుగుతున్నాను, నా చేతులతో లోకానికి సంబంధించిన మంచిపనులు ఏమైనా చేసినా ఇదంతా నీ పూజే అనుకొని చేస్తున్నాను శంకరా అన్నారు. మంచిపనులు చేసేవారు కూడా అహంకారాన్ని పెంచుకొంటారు. బయటకు మంచి పనులు చేసినట్లు కనిపిస్తారు కాని లోపల కుళ్ళిపోతూ ఉంటారు. ఎందుచేతనంటే అక్కడ నేను అనే తలంపు ఉంది కదా, ఆ నేను అనే తలంపు వాడిని శుభ్రంగా పాడుచేస్తుంది, వాడికి పుణ్యం రావచ్చుకాని జ్ఞానం సున్నా.

మనకు నేను అనే తలంపు, నాది అనే తలంపు ఉన్నాయి. ఉదయం లేచినది మొదలు రాత్రి పడుకునేవరకు వాటి గురించే ఆలోచిస్తున్నాము, గుడి చుట్టూ తిరిగినట్లుగా నేను, నాది అనే తలంపులు చుట్టూ తిరుగుతున్నాము. రమణమహర్షి గారి పుస్తకాలు, ఆచార్యులవారి పుస్తకాలు చదివేసి ఆ తలంపులను పొండి పొండి అంటే అవి ఎక్కడికి పోతాయి. మీకు ఏదైనా పోవాలి అంటే అవి మీకు కనబడకుండాపోతే మనం వాటిని మర్చిపోతాము కాని నిరంతరం అవే మనకు కనబడుతూ ఉంటే అవి పోవటానికి అవకాశం లేదు. భార్యభర్తలు ఇద్దరు ఒప్పుకుంటేనేగాని డైవర్సు జరగదు అలాగే నువ్వు వాటిని పొమ్మన్నా, మనల్ని విడిచిపోవటానికి నేను, నాది అనే తలంపులకు ఇష్టం లేదు అనుకోండి ఇంక అవి బయటకు పోవు అని చెపుతున్నాడు. వాటంతట అవి మనలను విడిచిపెట్టాలి కాని మనం వాటిని విడిచిపెట్టటం కష్టం. ఏదోచెట్టు కింద కూర్చుని నేను ఎవడను? నేను ఎవడను? అంటే అంత తేలికగా అవి పోవు. చాలామంది నేను ఎవడను? పుస్తకాలు చదువుతున్నారు ఇందులో నేను అనే తలంపు పోయినవాడు ఎవడో చెప్పండి? అది మనలను వదిలేయాలి కాని మనం దానిని వదిలించుకోలేము. అది మనలను వదలటానికి ఈశ్వరానుగ్రహం ఉండాలి, దైనందిన జీవితంలో మన బిహేవియర్ ఇంటెలిజెంట్‌గా, ఇంపెర్సనల్‌గా ఉండాలి. అంటే పని కనిపిస్తూ ఉండాలి, మనిషి కనబడకూడదు, మనం ఎలా ఉంటాము అంటే మనుషులం కనిపిస్తూ ఉంటాము కాని పని చెయ్యము, ఈశ్వరానుగ్రహం లేకుండా

అద్వైతానుభవం కలుగదు. ఈశ్వరానుగ్రహం ఎప్పడు కలుగుతుంది అంటే నువ్వు రూపబుద్ధి, నామబుద్ధి లేకుండా పని చెయ్యాలి. మనం చూద్దామన్నా అక్కడ వ్యక్తి కనబడకూడదు, పని జరిగిపోతూ ఉండాలి. నీమాట, చేత, తలంపు నిదానంగా ఉండాలి. అప్పడు ఈశ్వరుని దయకు పాత్రుడవు అవుతావు. ఈశ్వరుని దయ వలన మాత్రమే నేను, నాది అనే తలంపులు నిన్ను విడిచిపెట్టిపోతాయి.

నీ హృదయాంతరాళాలలో పరమేశ్వరుడు అంతర్యామిగా ఉన్నాడు. అయితే నువ్వు అంత లోపలకు దిగలేకపోతున్నావు. నీకు ఇంద్రియనిగ్రహం లేదు, మనోనిగ్రహం లేదు అందుచేత అంత లోపలకు వెళ్ళలేకపోతున్నావు. నీకు తూకం తక్కువగా ఉంది. ఇంద్రియనిగ్రహం ఉన్నప్పడే, నీ మనస్సును నియమించుకొన్నప్పడే నీకు తూకం పెరుగుతుంది, అప్పడు మాత్రమే నువ్వు హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళగలవు. నువ్వు తూకాన్ని పెంచుకొని హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళేకొలది అక్కడ ఉన్న పరమేశ్వరుడు నిన్ను కౌగిలించుకొనే టైములో ఈ నేను, నాది అనే తలంపులు పోతాయిగాని అప్పటిదాకా ఇవి పోవు. భగవంతుడి కౌగిలిలో నువ్వు ఉన్నప్పడు మాత్రమే ఈ నేను, నాది అనే తలంపులు పోతాయి గాని బయట నువ్వు చేసే జిమ్మిక్కుల వలన ఇవి పోయే అవకాశం లేదు. యోగం అంటే ఏవో ఆసనాలు వేయటంకాదు జీవుడిని తీసుకొనివెళ్ళి వాడి పుట్టు స్థానమైన హృదయంలో లయం చెయ్యాలి. హృదయంలోనికి నీ మనస్సు వెళ్ళి లయం అవ్వాలి. అప్పడు ఈ నేను, నాది అనే తలంపులు నీకు కనిపించకుండా పోతాయి.

నీ మనస్సును నాకు ఇచ్చేయి అని భగవంతుడు అంటున్నాడు. ఆయన చెప్పినంత తేలికకాదు ఇవ్వటం. నువ్వు మనస్సును నాకు ఇచ్చేస్తే నువ్వు ఇంక లోకంలోకాదు జీవించేది, నాలోనే జీవిస్తావు అంటే పారమార్థిక జీవితంలోనికి వచ్చేస్తావు. మనస్సును నాకు అర్పించటానికి నువ్వు అభ్యాసం చెయ్యి. మనిషి ఏమి చేస్తాడు అంటే వాడు మంచిపని చేసినా, చెడ్డపని చేసినా వాడి అహంకారాన్ని సంతృప్తిపరచుకోవటం కోసం పనిచేస్తాడు. వాడు చేసే పనులు, వాడు మాట్లాడే మాటలు అహంకారానికి మేత, అప్పడు ఇంక అది ఎలా పోతుంది. నీ అహంకారాన్ని ఒక ప్రక్కనపెట్టి, నీ ఇష్టాలు అయిష్టాలు వదిలేసి, నేను వద్దని చెప్పిన పనులు మానేసి, నాకు ఇష్టమైన పనులు నేను చెయ్యమని చెప్పిన పనులు నువ్వు చేస్తూ ఉండాలి. నువ్వు ఏరకంగా పనిచేస్తే నా దయ నీకు కలుగుతుందో ఆ రకంగా పని చేసుకొంటూ వెళ్ళు. పని నేచురల్‌గా మనల్ని విడిచిపెట్టి వెళ్ళిపోతే దానివలన

ఇబ్బంది లేదు. కాని చేసే పనిని మనం బలవంతంగా విడిచిపెడితే దాని వలన జన్మలు పెరుగుతాయి, నీ లోపల అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు, ఆయన దయను సంపాదించు, ఆయన దయను సంపాదిస్తే నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మనకు అబద్ధమైన దేవుళ్ళు అంటే ఇష్టం కాని నిజమైన దేవుళ్ళు అంటే ఇష్టం ఉండదు. ఎందుచేతనంటే అబద్ధమైన దేవుళ్ళు దగ్గరకు వెళ్ళినా ఈ మనస్సు పోదు, అహంకారం పోదు. నిజమైన దేవుడి దగ్గరకు వెళ్ళేటప్పటికి ఆయన ఆత్మ అయి ఉన్నాడు కాబట్టి నీకు ఆత్మబుద్ధి కలుగుతుంది, దేహబుద్ధి పోతుంది. మనం ఏ దేవతలనైతే పూజిస్తున్నామో వారందరూ ఉన్నారా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నువ్వు ఈ దేహంలో ఉన్నాను అనుకొంటున్నావు కదా. నువ్వు ఎలా అయితే ఉన్నాను అనుకొంటున్నావో అలాగే వాళ్ళు కూడా ఉన్నారు. అయితే ఈ నేను ఎంత నిజమో వారు కూడా అంతే నిజం. అది పారమార్థిక సత్యం కాదు.

ఆచార్యుడు ఆయన బాడీలెస్, మైండ్‌లెస్, వరల్డ్‌లెస్, గాడ్‌లెస్ అటువంటి మహోన్నతమైన స్థాయిలోనికి నిన్ను తీసుకొని వెళ్ళటానికి చేసే ప్రయత్నమే ఆచార్యుడి బోధ. అక్కడ అసలు ద్వైతం లేదు, నువ్వు వేరు నేను వేరు అనే బేదబుద్ధి రావటానికి అవకాశం లేదు. బ్రహ్మం తప్పించి, సత్యం తప్పించి ప్రతీదీ నీ మనస్సు యొక్క కల్పితం. మనోనాశనం అవ్వాలి. మనోనాశనం అవ్వాలి అంటే మనస్సు వెళ్ళి హృదయంలో లయమవ్వాలి. సత్యసాక్షాత్కారం అయ్యేవరకు ప్రతిజన్మలోను ఏదోరకమైన దుఃఖం, ఏదోరకమైన అశాంతి, ఏదోరకమైన వెలితి నిన్ను వెంటాడుతూనే ఉంటాయి, దానిని ఎవరూ ఆపలేరు. ఈ రోజున బాగానే ఉన్నాము రేపటి రోజు ఎలా ఉంటుందో చెప్పలేము. ఈ మధ్యన ఒక డాక్టరుగారు బాగా సంపాదించుకొన్నారు. నేను బాగా అభివృద్ధిలోనికి వచ్చాను అని పాపం సంతోషిస్తున్నారు. మీ అమ్మాయి ఇంకో కులం వాడిని పెళ్ళి చేసుకోవటానికి ప్రయత్నం చేస్తోంది అని సడన్‌గా వార్త వచ్చింది. అంతే ఆయన సంతోషం అంతా ఎగిరిపోయింది. ఇదే పరమాత్మ గీతలో చెప్పాడు. నీ ఇంద్రియాలద్వారాగాని, నీ మనస్సు ద్వారాగాని బయట విషయాల నుండి నువ్వు ఏ రకమైన ప్లెజర్ తీసుకొన్నా అదంతా ఏనాటికైనా పెయిన్‌కింద మారిపోతుంది అని చెప్పాడు. అంటే వడ్డీతో సహా నువ్వు దుఃఖాన్ని అనుభవించవలసిందే ఎందుచేతనంటే అది నిజమైన సంతోషం కాదు, అది సత్యంలోనుండి వచ్చిన ఆనందం కాదు. అనాత్మవిషయాల నుండి నువ్వు తాత్కాలికంగా సంతోషం పొందినా ఏనాటికైనా అది దుఃఖంగా మారిపోవును. ఒకవేళ ఈ జన్మ నీకు బాగా వెళ్ళిపోయింది అనుకో వచ్చే జన్మలో అయినా ఈ భారం అంతా మోయవలసిందే. మీలో ఎంత పాపకర్మ ఉన్నప్పటికీ

మీరు ఆత్మజ్ఞానం కనుక సంపాదిస్తే ఆ అగ్నిలో పాపకర్మ అంతా కాలిబూడిద అయిపోతుంది, ఆత్మజ్ఞానం యొక్క వైభవం అట్టిది. ఆత్మవిద్యతో పోల్చదగిన విద్యలేదు. ఆత్మవిద్య వలన మాత్రమే ఆత్మ తెలియబడుతుంది.

ధనం వలన, విద్యవలన అవినయం వచ్చే అవకాశం ఉంది. నీకు బాహ్యపరిస్థితులు అన్నీ బాగున్నప్పటికీ నువ్వు వినయాన్ని విడిచిపెట్టవద్దు. మీ మొఖంలో అవినయం కనిపిస్తూ ఉంటే మీరు ఈశ్వరుని ప్రభావంలో లేరు, మాయ ప్రభావంలో ఉన్నారు అని అర్థం. అందుచేత మీకు ఎన్ని ఉన్నప్పటికీ మీ మొఖంలో అవినయం కనబడకూడదు, మీ మొఖంలో అవినయం కనబడుతోంది అంటే భవిష్యత్‌లో మీరు పాడైపోతారని గుర్తు. మన శరీరం చనిపోయాక ఈ శరీరం మన కూడా రాదు కాని ఈ శరీరంలో ఉండగా మనం సంపాదించుకొన్న గుణాలు మనకూడా వస్తాయి. అందుచేత గుణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అసురసంపద ఉన్నవాడికి దైవజ్ఞానం కలుగదు. దైవీసంపద ఉన్నవాడికే దైవజ్ఞానం కలుగుతుంది. ఈశ్వరుడు అంటే సత్యం, ఆయన మనలాగ ఒక వ్యక్తికాదు. ఆయన విశ్వాత్మ. ఈశ్వరుడు మాట్లాడుతున్నాడు అంటే అక్కడ సత్యమే మాట్లాడుతుంది. మన మాటకు, మన ప్రవర్తనకు తేడా ఉండవచ్చు కాని దేవుడు, దేవుడి వాక్యం ఒక్కటై ఉన్నది, ఆ వాక్యం కూడా దేవుడితో సమానము. అందుచేత ఆ వాక్యాన్ని అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, జీర్ణం చేసుకొంటే నువ్వు ఈశ్వరుడిలో ఐక్యమవుతావు. నువ్వు సత్యం వైపుకు జరుగుతూ ఉంటే, ఆవలయంలోనికి వెళ్ళగలిగితే నువ్వు విడిచిపెట్టేసిన గుణాలు తిరిగి నీ దగ్గరకు వచ్చే అవకాశం లేదు. నిన్ను సత్యం దగ్గరకు తీసుకొని వెళ్ళేది ప్రేమ, సత్యం నుండి నిన్ను దూరం చేసేది కామం. కామం వేరు, ప్రేమ వేరు. కామానికి కోరికలు ఎక్కువ ఉంటాయి, ప్రేమకు కోరికలు ఉండవు. కామం నిన్ను మోహంలో ప్రవేశపెడుతుంది. మోహంలో నుండి నిన్ను విడుదల చేసేది ప్రేమ. ఈశ్వరుని పాదాల దగ్గరకు తీసుకొనివెళ్ళేది ప్రేమ, ఈశ్వరుని పాదాలకు దూరం చేసేది కామం.

మహాత్ములతోటి సాంగత్యం వలన వారి అంతస్థు మనకు తెలియకపోయినా, వారి హృదయం యొక్క లోతులు మనకు తెలియకపోయినా, వారు నీకు ఒక్కమాట కూడా బోధించకపోయినా దూడ వెనకాల మనిషి ఉండి దానిని ఎలా తోలుకెళతాడో అలాగ మనోమూలమైన హృదయంలోనికి నీ మనస్సును మహాత్ముల యొక్క అనుగ్రహం తోలుకొనిపోతుంది, అది మహాత్ముల యొక్క వైభవం. దూడను కర్రపుచ్చుకొని ఎలా

తోలుకెలతాడో అలాగ గురువు ఏమీ కర్రపుచ్చుకోడు, ఆయన అనుగ్రహం వల్లే నీ మనస్సును హృదయంవైపుకు నడిపిస్తూ ఉంటాడు. కొంతమంది ఎంత ఉన్నా వారికి సంతృప్తి ఉండదు, అసంతృప్తిగా ఉంటారు. ఈ అసంతృప్తిలో నుండే ఇతరుల మీద అసూయ పుడుతుంది. మహాత్ములతోటి శారీరకంగా దూరంగా ఉన్నప్పటికీ మహాత్ములను యోగులను స్మరించటం వలన, వారితో మానసికసాంగత్యం వలన నువ్వు పవిత్రుడవు అవుతావు, నీ హృదయంలో ఉన్న నిజతత్వం నీకు ఎరుకలోనికి వస్తుంది, వారి సహవాసం వలన వచ్చే లాభం అది.

గీతాశాస్త్రం కేవలం అర్జునుడిచేత యుద్ధం చేయించటానికి కాదు, యుద్ధభూమిని నెపంగా పెట్టుకొని మానవజాతికి పరమాత్మ ఇవ్వవలసిన సందేశం ఇచ్చాడు. రామరావణ యుద్ధంలో కూడా లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు విభీషణుడు రాముడితో అంటాడు ఈ రాక్షసులను సంహరించటం కష్టం, సీతచుట్టూ కాపలా ఉన్నవారందరూ నాకు స్నేహితులే వారితో చెప్పి దొంగచాటుగా సీతను ఇక్కడకు తెప్పిస్తాను, సీతను మనం అయోధ్యకు తీసుకొనిపోదాము అని విభీషణుడు చెపుతాడు. అప్పుడు రాముడు ఏమన్నాడు అంటే ఈ మహాయుద్ధం అంతా సీతకోసం చేస్తున్నామా? ఇక్కడ సీత ముఖ్యం కాదు, రాక్షస సంహారం ముఖ్యం, రాక్షస సంహారం పూర్తి అయ్యేవరకు ఈ యుద్ధం ఆగదు, ఈ లోపుగా మనం ఎవరిని కోల్పోయినా ధర్మాన్ని ఆచరించటం మానను అని చెప్పాడు. అందుచేత రాముడు ధర్మస్వరూపుడు అని చెపుతారు. రామకృష్ణుడికి ఎకరన్నర భూమి వారసత్వంగా వస్తుంది. అన్నగారు వాళ్ళ భూమిని అమ్మినప్పుడు ఈ ఎకరన్నర గురించి సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో ఈయనను సంతకం పెట్టమన్నారు. నేను ఎందుకు పెట్టాలి అని రామకృష్ణుడు సబ్‌రిజిస్ట్రార్‌ను అడుగుతాడు. దాని మీద నువ్వు హక్కుదారుడు, నువ్వు సంతకం పెడితేనేగాని కొనుక్కొన్నవాడికి అది చెల్లదు అని చెపుతాడు. అప్పుడు రామకృష్ణుడు చెప్పిన మాట నాకు ఎక్కువగా గుర్తుకు వస్తుంది. రామకృష్ణుడు ఏమన్నాడు అంటే ఒక వ్యక్తికి ఆస్తి ఉండవచ్చు, దేహాత్మబుద్ధి ఉన్నవాడికి ప్రోపర్టీ ఉండవచ్చు ఏమండీ రిజిస్ట్రార్‌గారు చైతన్యానికి ఎక్కడైనా పొలం ఉంటుందా, చైతన్యానికి ఎక్కడైనా ప్రోపర్టీ ఉంటుందా అన్నాడు. ఆయన శరీరం చనిపోయినా ఆయన నోటినుండి వచ్చిన ఈ వాక్యానికి చావులేదు, అది ఇమ్మోర్టల్. సంతకం పెడితే ఆ ఆస్తిమీద నాకు హక్కు ఉన్నట్లు నేను అంగీకరించినట్టేకదా అన్నాడు. అప్పుడు కొనుక్కొన్నవాడు ఏమన్నాడు అంటే ఈయన ప్రవర్తన చూస్తే ఈయన సంతకం అవసరం లేదు అనిపిస్తోంది అన్నగారి సంతకం సరిపోతుంది అని చెప్పాడు, అప్పుడు అన్నగారు సంతకం పెట్టారు.

గురువు అంటే కేవలం భౌతికశరీరం కాదు. గురువు యొక్క శరీరం పోయినా ఆయన అనుగ్రహం పనిచేస్తూనే ఉంటుంది. మన శరీరం పోయినప్పుడు బాహ్యమైన సంబంధాలు అన్నీ తెగిపోతాయి కాని గురువుతో ఉన్న సంబంధం తెగదు. నువ్వు ఏ శరీరంలో ఉన్నా నీ అడ్రసు తెలుసుకొని నిన్ను వెంటాడి వెంటాడి చైతన్యం తాలుక ఎరుక నీకు కలిగేవరకూ గురువు అనుగ్రహం నిన్ను విడిచిపెట్టదు. అట్టిది గురువు అనుగ్రహం దానికి కారణాలు అక్కరలేదు. నేను, నాది అనే తలంపులు అవి నిన్ను విడిచిపెట్టాలి కాని నువ్వు వాటిని విడిచిపెట్టలేవు. నువ్వు సత్యాన్వేషణలో ఉన్నప్పుడు, సత్యం యొక్క సన్నిధిలోనికి నువ్వు జారుకున్నప్పుడు మాత్రమే ఈ నేను, నాది అనే తలంపులు కనబడకుండా పోతాయి. ఈశ్వరానుగ్రహం పొందటానికి మనం ప్రయత్నం చేయాలి. ఆయన అనుగ్రహం లేకుండా మనం ఏమీ చేయలేము. అదే నిజమైన సంపద. ఆచార్యులవారు ఒకసారి ఏమన్నారు అంటే సత్యానుభవం పొందాక నీ పాతఅలవాట్లను రమ్మన్నా అవి తిరిగిరావు. మన అలవాట్లు అన్నీ ఏమైపోయాయి అని వెదికినా అవి మీకు కనబడవు. సత్యసాక్షాత్కారం యొక్క వైభవం అది. నిప్పులో పడిన ఈగలు, దోమలు బతకగలవా? సత్యసాక్షాత్కారం అయిన తరువాత నీ పాతఅలవాట్లు కూడా నిప్పులో పడిన ఈగలు, దోమలవంటివే. అవి కాలి బూడిద అయిపోతాయి. శివుడే మొదటి ఆచార్యుడు, మొదటి గురువు. ఆయన అనుగ్రహస్వరూపుడు. అనేకమంది దేవతలు అనేకమంది కోరికలు నెరవేర్చవచ్చు. మీకు ఏమి కావాలంటే అవి కోరుకోండి, అవి వస్తాయి, అవి ఎంతకాలం ఉంటాయి అనుభవిస్తే పోతాయి. శివానుగ్రహం లేకుండా అద్వైతానుభవం కలుగదు అని ఆచార్యులవారు చెప్పారు. అలాగని ఆయనకు శివకేశవ బేధం లేదు. మరి అలా ఎందుకు ఆయన చెప్పాడో, అదే నేను ఈ శివరాత్రి రోజున మీకు రిపీటెడ్‌గా చెపుతున్నాను.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-05-2011, గుండుగొలను)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనిషికి మాటలోకాని, చేతలోకాని, ఆలోచనలోకాని తొందరపాటు పనికిరాదు. శాంతచిత్తం అవసరం. మనం శరీరానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నాము. కాని శరీరానికి ఎంతవరకు ప్రాముఖ్యత ఇవ్వాలి అంటే జ్ఞానసముపార్జనకి ఉపయోగపడేలాగ ఉంటే సరిపోతుంది. దైవీసంపద పెంచుకుంటూ రావాలి. దైవీసంపద పెంచుకోవటం వలన ఆత్మజ్ఞాన సంపాదనకు అర్హత కలుగుతుంది. రాగ దోషము, ద్వేష దోషము ఈ రెండూ

పెద్ద దోషాలు అని, ఈ రెండింటి గురించి బుద్ధుడు జీవితం పొడుగునా చెప్పాడు. నువ్వు లోపలకు వెళ్ళే ప్రయత్నం చేసుకో, లోపలకి వెళ్ళి లోపలఉన్న సద్వస్తువు తాలుకా అనుభవాన్ని పొందు. బయట ఏముంది? ఏ దేశానికి వెళ్ళినా, ఏ ప్రాంతానికి వెళ్ళినా, ఏ కుటుంబంలో చూచినా ఏముందీ లోకంలో రాగద్వేషాలు తప్పించి బయట ఎక్కడా ఏమీలేదు అని బుద్ధుడు చెప్పాడు. మనం ఈ శరీరంలో ఉండగానే నూటికి నూరుపాళ్ళు ఆనందముగా, శాంతిగా, సుఖంగా ఉండగలిగితే శరీరం పోయిన తరువాత కూడా ఈ శాంతి, ఆనందం కంటిన్యూ అవుతుంది. మన శరీరం ఉండగా ఆనందాన్ని సంపాదించలేకపోతే శరీరం చనిపోయిన తరువాత అశాంతి కంటిన్యూ అయిపోతుంది. ఇది గుర్తుపెట్టుకోండి. మీకు అవసరం లేని విషయాలకు వెళ్ళకండి. టైముని మీరు సద్వినియోగం చేసుకోండి. మీ శరీరం ఉండగానే, మీరు సంసారం మధ్యలో ఉండగానే, ఈ ప్రపంచం మధ్యలో ఉండగానే రాగద్వేషాల యొక్క వేగం తగ్గించుకోండి. ఇప్పుడు మీరు రాగద్వేషాలు తగ్గించుకోలేకపోయినా, మీ శరీరాన్ని జీవుడు విడిచిపెట్టి బయటికి వెళ్ళే రోజుకైనా రాగద్వేషాలు తగ్గించుకోండి. రాగద్వేషాలు తగ్గించుకుంటే మీ శరీరం పోయిన తరువాత కూడా శాంతి కంటిన్యూ అవుతుంది. ఓరామా, శ్రీరామా శాంతిలేని వాడికి సుఖం ఎక్కడ ఉంది, శాంతిలేనివాడికి ఆనందం ఎక్కడ ఉంది అని త్యాగరాజు తనకీర్తనలో పాడాడు. నాకు ధనం ఉంది, చదువు ఉంది నాకు ఆనందం అక్కరలేదు, శాంతి అక్కరలేదు అనేవాడు ఈ సృష్టిలో ఒక్కడు కూడా ఉండడు. ప్రతీ మనిషికి ఆనందం కావాలి. ఆనందం కావాలి అంటే శాంతి ఉండాలి. అయితే మనం శాంతిగా ఎందుకు ఉండలేకపోతున్నాము. దానికి తలంపులే కారణం. మంచితలంపులు అవ్వవచ్చు, చెడ్డతలంపులు అవ్వవచ్చు. ఏదో తలంపు వచ్చి మన శాంతిని చెడగొడుతున్నాయి. ఆ తలంపులు ఎక్కడ నుండి వస్తున్నాయి అంటే మనస్సులోంచే వస్తున్నాయి. దేహము నేను అనే తలంపు, దానికి వచ్చే ఇతర తలంపులని కలిపి మనస్సు అని పేరుపెట్టారు. ఆ మనస్సుని పవిత్రం చేసుకోవటమే, ఆ మనస్సుని ఏకాగ్రం చేసుకోవటమే, ఆ మనస్సుని నువ్వు సూక్ష్మం చేసుకోవటమే నీ సాధన యొక్క గమ్యం.

రోగభూయిష్టమైన, మలభూయిష్టమైన, ఇవాళ పచ్చగాఉండి, రేపు ఎండిపోయే ఈ శరీరం మీద మీరు మోహం తగ్గించుకోకపోతే మీకు జ్ఞానమా అన్నారు ఆచార్యులవారు. ఈ దేహమే సత్యము, ఈ దేహమే నిత్యము, దేహమే సర్వస్వం, ఈ దేహం తప్పించి ఇంక ఏమీ లేదు అని అనుకునేవాళ్ళకి ఆత్మజ్ఞానం వచ్చే అవకాశం లేదు. ఆత్మజ్ఞానం సంపాదించేవరకూ నీకు ఆనందము లేదు. నీ హృదయంలో ఉన్న ఆనందం నువ్వు

అనుభవైకవేద్యం చేసుకునే వరకూ జన్మలు తప్పవు. నీ శరీరం చనిపోయాక ఇతర లోకాలకి వెళ్ళటం తప్పదు. మీ రోజులు బాగా వెళ్ళిపోతున్నా స్వప్న సమానం, మీ రోజులు కష్టంగా వెళ్ళినా అదీ స్వప్న సమానమే ఇవన్నీ వ్యవహారికసత్యాలేకాని పారమార్థికసత్యం కాదు. మన మనస్సులో దోషాలు ఉన్నప్పటికీ మన మనస్సు ఏమని చెబుతుంది అంటే నువ్వు చాలా మంచిదానివి అని చెబుతుంది. అందుచేత మన మనస్సే మనల్ని మాయ చేస్తోంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా, లేని వస్తువు లేనట్లుగా మనకి వ్యక్తం కాకపోవటానికి కారణం మన మనస్సు, మన ఇంద్రియాలు అంతేకాని ఇంక బయట ఏ కారణాలు లేవు. ఉన్న వస్తువు ఉన్నట్లుగా మనకు గుర్తింపు వచ్చేవరకూ లేని వస్తువు లేనట్లుగా మనకు తెలియదు. రాముడి హృదయంలో ఏది ఉందో, వశిష్ఠుడు హృదయంలో ఏది ఉందో మన హృదయంలో కూడా అదే ఉంది. ఒకసారి యోగి రామయ్య గారిని మహాత్మగాంధీగారు అడిగారు. నారాయణుడు అందరి హృదయాలలో సమానంగా ఉన్నాడు. అయితే రమణమహర్షిగారికి మనకీ తేడా ఎక్కడ ఉంది అని గాంధీగారు అడిగారు. ఆయన హృదయంలో ఏమి ఉందో ఆయనకి తెలుసు, మన హృదయంలో ఏమి ఉందో మనకు తెలియదు. తెలిస్తే సుఖి, తెలియకపోతే దుఃఖం. తెలియటం, తెలియకపోవటం ఆ ఒక్కటే తేడాకాని వస్తువు అందరిలోను సమానంగానే ఉంది అని యోగిరామయ్యగారు చెప్పారు. లోపలఉన్న సద్వస్తువు యొక్క అనుభవం మనకి కలిగే వరకూ ప్రతీ జీవుడినీ భయం వెంటాడుతుంది. సంసారం ఎలా నడుస్తుంది అనే భయం, చనిపోయేటప్పుడు ఎన్ని బాధలు పడాలో అని భయం, పిల్లల జీవితాలు ఎలా ఉంటాయో అని భయం. ఇలా మునిమనవలు దాకా మీరు ఆలోచించటం. ఇదే మాయ. మీరు ఆలోచించినట్టు వారు ఉంటారా? మన దేహానికి ఎలాగ ప్రారబ్దం ఉందో అలాగే వారి దేహప్రారబ్దాలని బట్టి వారు ఉంటారు. మీరు అనుకున్నట్లుగా వారు ఉంటారని ఎప్పుడూ అనుకోవద్దు. ఒక చిన్న విషయం మీకు అర్థం అయితే మీకు ఇంక భయం లేదు, దుఃఖం లేదు. మీ ద్వారా ఏ పని జరిగినా నేను అది చేసాను, ఇది చేసాను అని ఏదో అనుకుంటూ ఉంటారు. దేనికీ మీరు కర్త కాదు. భగవంతుడు మీ శరీరాన్ని ఉపయోగించుకుంటున్నాడు. కర్త ఈశ్వరుడు అని మీకు అర్థం అయితే ఇంక దుఃఖం లేదు. కానీ అన్నింటికి నేనే కర్తని అని అనుకుంటున్నారు ఇదే మాయ.

రమణమహర్షిగారి సిద్ధాంతం జపం చేయమని, ధ్యానం చేయమని కాదు, చెయ్యవద్దని కాదు, అసలు మనస్సు అనేది ఉందో లేదో ముందు నువ్వు వెతుకు అన్నారు. మనస్సు అనేది ఉందో లేదో దానిని విచారణ చెయ్యి, దానిని విచారణ చేస్తే లేని మనస్సు

లేనట్టుగా తెలుస్తుంది. అప్పుడు నీకు సాధన చేసేవాడు అంటూ ఎవడూ మిగలడు. మనస్సు ఉందని నీకు స్థిరపడిపోతే అప్పుడు జపం చెయ్యి, ధ్యానం చెయ్యి. కొంతమంది మేము ఖర్మ అనుభవిస్తున్నాము అంటారు లేకపోతే మా రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అంటారు. ఈ ఖర్మలు, పునర్జన్మలు ఇవి అన్నీ మనస్సుకీ, శరీరానికే. లోపల ఉన్న సద్వస్తువుకి ఏమీ సంబంధం లేదు. బ్రహ్మంకి పుట్టుక లేదు, చావు లేదు. రమణసిద్ధాంతం కనుక మీకు అర్థం అయితే మీ దేహప్రారబ్ధం ఒకవేళ బాగోకపోయినా మీరు ఆనందంగా రోజులు గడిపేస్తారు. మీకు మనస్సు ఉంది అనుకుంటున్నారు కాబట్టి అందులో నుంచి విడుదల పొందటానికి ప్రయత్నం అవసరమే. మీ ప్రయత్నంతో పాటు గురువు సహాయం కూడా అవసరం. గురువు యొక్క దయ ఉంటే వాలుగాలిలో సైకిలు తొక్కితే ఎలా ఉంటుందో అలాగ మీ సాధన వేగంగా వెళు తుంది. నువ్వు భగవంతుడిని ఆరాధించగా, ఆరాధించగా నీ పుణ్య ఫలితంగానే ఆ చైతన్యమే గురు రూపం ధరించి వస్తుంది. మీ సాధనలు, మీ యాత్రలు, మీ పుణ్యాలు, మీ వ్రతాలు ఇవి అన్నీ కూడా గురువు దయ ముందు రెండో పక్షమే. అమృతత్వం పొందటానికి గురువు మార్గం కూడా చూపిస్తాడు. ఈ ఆధ్యాత్మిక మార్గంలో గురువు యొక్క ఆవశ్యకత ఎంతో ఉ ంది. మీకు కష్టం వచ్చినా, సుఖం వచ్చినా భగవంతుడికి తెలియకుండా రాదు. మనకి ఏది మంచిదో, మనకి ఏది చెడ్డదో గురువుకి తెలిసినట్టు మనకి తెలియదు. అందుచేత మీ ఇష్టమే నా ఇష్టం, మీ సంకల్పమే నా సంకల్పం అనుకుంటే మనకి హాయిగా, సుఖంగా, శాంతిగా జీవితం వెళ్ళిపోతుంది. నాకు ఇష్టాలు అంటూ లేవు, నీ ఇష్టమే నా ఇష్టం. నాకు సంకల్పాలు అంటూ లేవు, నీ సంకల్పమే నా సంకల్పం అని శరణాగతి చేసినా మనకి మనోనాశనం అవుతుంది.

అంతా ఈశ్వరసంకల్పంతోటి నడుస్తోంది. జరిగేది ఏదో జరుగుతుంది, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగదు. ఇది నిశ్చయము అని భగవాన్ చెప్పారు. ఇది మంత్రం. మీ వివేకం ఉపయోగించి, మీ ఏకాగ్రత ఉపయోగించి, మీ పవిత్రత ఉపయోగించి, మీ వైరాగ్యం ఉపయోగించి అంతా ఈశ్వరసంకల్పంతోటి నడుస్తోంది అని మీరు తెలుసుకోవాలి. అదే మీ జీవిత గమ్యం. అది మీరు తెలుసుకుంటే సుఖపడతారు. మీకు తెలియకపోతే దుఃఖపడతారు. మీకు తెలుసున్నా, తెలియకపోయినా జరిగేది అదే. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్న దానికి లేకపోవటం అంటూ లేదు. లేనిదానికి ఉండటం అంటూ లేదు. ఇది సందేహరహితము. లేనిది కూడా ఉందని నువ్వు అనుకోవచ్చు, నువ్వు అనుకున్నావని అది ఉండదు. నీకు ఇష్టం ఉన్నా

లేకపోయినా జరిగేది అదే. నువ్వు దానిని అర్థం చేసుకోవాలి అవగాహన కూడా యోగంతోటి సమానం. మీకు ముఖ్యంగా వివేకం, వైరాగ్యం ఉండాలి. మీరు చేతులతోటి పని చేస్తున్నప్పటికీ మనస్సులో వైరాగ్యం ఉండాలి. మీ ఇంట్లో వాళ్ళకి మీరు డ్యూటీ చెయ్యాలి. మీ అంతరాళాల్లో వీళ్ళు మనవాళ్ళు కాదని తెలియాలి. ఆ గుర్తింపు పెట్టుకొని పనిచెయ్యండి. మరి మన వాళ్ళు కానప్పుడు వారిని మనవాళ్ళని ఎందుకు అనుకుంటున్నాము. దానికి కారణం మోహం. మనకి ఎప్పుడైనా అశాంతి, దుఃఖము వస్తోంది అంటే దానికి కారణం మోహమే. మీరు సాధన విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మీ దైనందిన జీవితంలో ఆలోచనలోకాని, మాటలోకాని, చేతలోకాని రూపబుద్ధి, నామబుద్ధి పెరగకుండా చూచుకోవాలి. ఆ రకంగా జీవిస్తే రూపబుద్ధీ పోతుంది, నామబుద్ధీ పోతుంది. మీరు నెమ్మదిగా నడిచినా మార్గం మాత్రం విడిచిపెట్టకండి. మీరు చేరుకోవలసిన గమ్యం మర్చిపోవద్దు.

ప్రాపంచికమైనటువంటి నామరూపాల మీద నాకు మోహం పోయింది. ఇప్పుడు నీ మోహంలో పడ్డాను. నీ మోహంలో పడటం వలన అరుణాచల, అరుణాచల అని నిన్ను నేను విడిచిపెట్టలేకపోతున్నాను అన్నారు భగవాన్. నీ మీద నేను మోహపడటం వలన లోకానికి సంబంధించిన వాసన పోయింది. కానీ నేను ఇప్పుడు అద్వైతానుభవం పొందాలి అంటే నీ మీద కూడా నాకు మోహం పోవాలి. నీమీద ఇష్టం పోవాలి అంటే నా సాధన సరిపోదు. నీ మీద ఇష్టం కూడా నువ్వే పోగొట్టు అరుణాచలేశ్వరుడా. నువ్వు వేరుగా ఉన్నావు అనుకుంటే మళ్ళీ కోరికలు అడగాలి అనిపిస్తుంది, రకరకాల తలంపులు వస్తాయి. అందుచేత నీ మీద కూడా నాకు ఇష్టం పోవాలి. అది నువ్వే చెయ్యాలి. అప్పుడు కాని నాకు అమృతానుభవం కలుగదు అని అక్షరమణమాలలో భగవాన్ చెప్పారు. మీరు సాధన ప్రారంభించినప్పుడు కొంత కష్టపడాలి. మీ మనస్సు పవిత్రమవుతున్నట్టు, మీ మనస్సు ఏకాగ్రమవుతున్నట్టు మీకు గుర్తు ఏమిటి అంటే ఈశ్వరుడిని పొందాలి, మోక్షసుఖం పొందాలి అది ఒక్కటే నా జీవిత గమ్యం, మనం పొందవలసింది అదే అని నీకు అనిపిస్తుంది. నువ్వు పవిత్రుడవు అవ్వకుండా ఈశ్వరుడిని పొందాలి అనే కాంక్ష కూడా నీకు రాదు. నువ్వు పొందుతావా లేదా అనేది వేరే విషయం. కనీసం నీకా డిజైర్ కూడా ఎరైజ్ కాదు. ఈశ్వరుడు ఏదో గురురూపంలో మీకు కనిపిస్తూ ఉంటాడు, మీతోటి మాట్లాడుతూ ఉంటాడు, మీతోటి కలిసి భోజనం చేస్తాడు కానీ వాడు ఎవడో మీకు తెలియనివ్వడు. కానీ మిమ్మల్ని ఎక్కడికి తీసుకువెళ్ళాలో ఆ గమ్యం మరచిపోడు. ఒకోసారి మీరు అనుకున్న కోరికలన్నీ నెరవేర్చేస్తూ

ఉంటాడు. ఒకోసారి ఆపుచేస్తూ ఉంటాడు. మీకు భోగాలు ఉన్నప్పుడు ఎలాగ ఉన్నారో చూస్తాడు, మీకు కష్టాలు ఉన్నప్పుడు ఎలాగ ఉన్నారో చూస్తాడు, రెండూ సమానంగా తీసుకోలేకపోతే ఒక ప్రక్కన పెడతాడు కాని మొత్తానికి విడిచిపెట్టేయడు. ఇది అంతా భగవంతుడు చేస్తున్నాడు అని మీకు తెలియదు. మీ పిల్లలు బాగా చదువుకుంటున్నారా అంటాడు, మీ అమ్మాయికి పెళ్ళి అయిపోయిందా అంటాడు, ఇవన్నీ గురువుకి ఎందుకు? మీతోటి ఎక్కువ చనువుగా ఉండటంకోసం అలా అడుగుతూ ఉంటాడు. మీతో చనువుగా ఉండటానికి కారణం ఏమిటి అంటే మీ మనస్సుని శుద్ధి చేయటానికి తప్పించి గురువుకి ఇంకోపని లేదు. ఎందుచేతనంటే మనస్సును శుద్ధి చేయకుండా జ్ఞానం ఇస్తే మీ మనస్సు భరించలేదు. నువ్వు మొయ్యలేని బరువు నీ నెత్తిమీద పెడితే ఏమవుతుంది? కింద పడిపోతావు. అందుచేత గురువు మీకు ఎంతవరకు అర్హత ఉందో, యోగ్యత ఉందో చూచుకుంటాడు. అర్హత లేదని, యోగ్యత లేదని వీళ్ళు పనికి రారని వదిలేయడు. మీకు ఆ యోగ్యత, అర్హత వచ్చేవరకూ చేపను తోమినట్టు తోముతాడు. గురువు ఒకోసారి మీకు దూరంగా ఉన్నట్టు ఉంటాడు. గురువుకీ మనకీ సంబంధం తెగిపోయింది అని మీకు అనిపిస్తుంది. మళ్ళీ ఇంకోరోజున హృదయానికి సన్నిహితంగా వచ్చి తాకుతాడు. గురువు మనకి దూరంగా ఉన్నప్పుడు ఎలాగ ఉంటున్నాము, సమీపంలో ఉన్నప్పుడు ఎలాగ ఉంటున్నాము, శాంతిగా ఉన్నప్పుడు ఎలాగ ఉంటున్నాము, అశాంతిగా ఉన్నప్పుడు ఎలాగ ఉంటున్నాము? ఇవన్నీ చూసుకుంటూ ఉంటాడు. మీ మనస్సుకి సమానత్వం తీసుకొనివచ్చేవరకూ గురువు నిన్ను వదిలిపెట్టడు.

గురువుకి శరీరం అవసరం లేకపోయినా నీ మనస్సుని నిర్మలం చెయ్యటానికి, నీ మనస్సుని పవిత్రం చెయ్యటానికి గురువు శరీరం ధరిస్తాడు. గురువుని గురువు అనుకోవటంకంటే అనుగ్రహమే, దయే అనుకోవటం మంచిది. గురువు దయ ఒకసారి నీ శిరస్సు మీద పడితే దానిని తప్పించుకుని నువ్వు ఎక్కడకు వెళ్ళలేవు. నువ్వు ఎక్కడికి పారిపోయినా మళ్ళీ ఆ గేటు ద్వారానే నువ్వు మోక్షం పొందాలి. గురువుతోటి సంబంధం కంటే ఇనుపసంకెళ్ళు మెరుగు. ఇనుప సంకెళ్ళని మనం గొడ్డలిపెట్టి నరికేసుకుంటే పోతాయి. కానీ గురువుతోటి ఉన్న సంబంధాన్ని మనం గొడ్డలి పెట్టి నరకలేము. ఎందుచేతనంటే అవి సంకెళ్ళేకాని మన కళ్ళకి కనపడవు. కళ్ళకి కనపడకపోతే వాటిని ఎలా ఛేదిస్తాము. అందుచేత గురువు దయ కనుక మీకు ఉంటే అంతా ఉన్నట్టే. గురువు దయలేకపోతే అన్నీ ఉన్నా ఏమీ

లేనట్టే. ఒకోసారి మీకు కష్టాలు వస్తే మీ బంధువులు విడిచిపెట్టేయవచ్చు, మీ స్నేహితులు విడిచిపెట్టేయవచ్చు కానీ ఎట్టిపరిస్థితులలోను మీ గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. ఈ శరీరం పోయినప్పడు మనకి బంధువులతోటి, స్నేహితులతోటి, ఆస్తులతోటి అందరితోటి సంబంధాలు తెగిపోతాయి. కానీ గురువు మనకి ఆత్మానుభవం కలుగజేసేవరకూ ప్రతీ జన్మలోను మనల్ని వెంటాడుతూ ఉంటాడు. బోయవాడు జంతువుని చంపటానికి ఎలా వెంటాడుతాడో అలాగ మన వ్యక్తిభావనని, మన అజ్ఞానాన్ని నిర్మూలించటానికి ఈ జన్మలో మనం ప్రిపేర్ అవ్వలేకపోతే వచ్చే జన్మలో అయినా మనల్ని వెంటాడి, వెంటాడి మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి తన స్వరూపాన్ని మనకి ఇచ్చే వరకూ గురువు మనలను విడిచిపెట్టడు. శరీరాలు మారిపోయినా గురువు మనలను వెంటాడుతూనే ఉంటాడు. వాడు గురువు. గురువు అనుగ్రహం మీరు ఎప్పడూ రుచి చూడలేదు. ఆ అనుగ్రహం మీరు రుచి చూస్తే తెలుస్తుంది. ఆ అనుగ్రహం ఎలా ఉంటుంది అంటే ఏదో దూరంగా ఉన్న వస్తువుని చూచినట్టుకాదు. ఈ చెయ్యి, ఆ చెయ్యిని ముట్టుకుంటే ఆ స్పర్శ మీకు ఎంత స్పష్టంగా తెలుస్తుందో అలాగ గురువు దయ మీ హృదయంలో మెదిలినప్పడు అంత స్పష్టంగా మీకు భౌతికంగా అది తెలుస్తుంది. మీ హృదయంలో ఉన్న సద్వస్తువే గురురూపం ధరించి బయట తిరుగుతూ ఉంటుంది. ఎందుచేతనంటే మీ మనస్సుని పవిత్రం చేసి, మీ మనస్సుని ఏకాగ్రపరచి మిమ్మల్ని లోపలకి నెట్టటంకోసం రూపం ధరించి వస్తాడు. నా మనస్సు కుదురుగా ఉండటం లేదు, నా మనస్సు శాంతిగా ఉండటంలేదు అని మీరు అనుకుంటూ ఉంటారు. మీరు తొందరపడకండి. మీ మనస్సులు ఎంత చలనంగా ఉన్నా అది గురువు అనుగ్రహం వలన నిశ్చలమయ్యే రోజు సమీపంలోకి వస్తోంది. ఎప్పడోకాదు, ఈ జన్మలోనే అది వస్తుంది. మీరు గురువుపట్ల విశ్వాసం వదిలిపెట్టకండి, నమ్మకం వదిలిపెట్టకండి. ఏ మనస్సు అయితే నిన్ను పీడిస్తోందో, ఏ మనస్సు అయితే నీకు బంధకారణమో, ఆ మనస్సుని శాంతపరచి, నిర్మలంచేసి తనలో ఐక్యం చేసుకుంటాడు. వాడు గురువు. ఇది నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము.

నీకు ద్వేషం అనే దోషం లేదు అనుకో, రాగం అనే దోషం లేదు అనుకో, ఇంక నీ మనస్సు బాహ్యముఖం అవ్వటానికి అవసరం ఏముంది. మీ శరీరం ఇక్కడ ఉంది, మీ మనస్సు భీమవరం వెళ్ళవలసిన పని ఏమిటి? శరీరం ఉన్న చోట మనస్సు ఎందుకు ఉండటంలేదు? రాగం అనే దోషమో, ద్వేషం అనే దోషమో ఏదో ఒక దోషం నీలోపల

ఉంది చూచుకో. ఏ దోషం లేకపోతే నువ్వు బయటకు వెళ్ళవలసిన పని ఏమిటి? అందుచేత వాటి వేగం తగ్గించుకో. ఒకేసారి సడన్ బ్రేకు వేయకు. స్లోగా తగ్గించుకుంటూ, తగ్గించుకుంటూ నీ శరీరం శవం అయ్యేటప్పటికి జీరో చేసుకో ఇదీ సిద్ధాంతం. ఆచార్యులువారు ఏమన్నారు అంటే కక్కిన కూడు కోసం ఎవడూ ఆశపడడు. అలాగే మీరు స్వచ్ఛందంగా విడిచిపెట్టేసిన భోగాలను మళ్ళీ కోరుకుంటూ ఉంటే మీ నోటితో కక్కిన కూడు మళ్ళీ మీరు ఆశించినట్టే అన్నారు. నువ్వు శరీరం అనుకోవటం వలన గురువుని కూడా శరీరంగానే చూస్తావు, కానీ గురువు ఒక రూపం ధరించి నీకు కనిపిస్తున్నప్పటికీ, గురువు బయట నుంచి చేసేది తక్కువే, లోపలినుంచి ఎక్కువ చేస్తాడు. గురువు నీతో మాట్లాడుతూ ఉంటాడు, వాడు చేసేపని అంతా లోపల ఉంటుంది. మీ మనస్సులో ఉన్న బలహీనతలు ఏమిటో మీకు చూపిస్తాడు. నువ్వు ఎక్కడ దారి తప్పిపోతున్నావో చూస్తాడు. ఏ కారణాల వల్ల మనస్సు బాహ్యముఖం అవుతుందో చూస్తాడు. నీకు పునర్జన్మలకి కారణాలు ఏమి ఉన్నాయో లోపల చూస్తాడు. ఆ కారణాలు ఏమిటో నీకు చూపించి, నెమ్మదిగా ఒకోటి ఒకోటి బయటకి లాగి కాల్చి బూడిద చేసేవరకూ గురువు నిన్ను విడిచిపెట్టడు. వాడు గురువు. రామకృష్ణ పరమహంస మహేంద్రనాధగుప్తాతో అంటాడు నీ సంసారం చూస్తే పెద్ద సంసారం. నిన్ను నా హాస్పటల్‌లో చేర్చేసుకున్నాను, ఇప్పుడు నువ్వు చావటానికి సిద్ధంగా ఉన్నావు. నిన్ను హాస్పటల్ నుంచి ఇప్పుడు ఎలా బయటకు పంపుతాను. చచ్చిపోతే మా హాస్పటల్‌లోనే చచ్చిపోదువుగాని, నిన్ను రోడ్డు మీద విడిచిపెట్టను. నువ్వు బాగుపడే వరకూ ట్రీట్‌మెంట్ ఇస్తూనే ఉంటాను అన్నాడు రామకృష్ణుడు. నీకు గొప్ప శక్తులు ఉండవచ్చు, గొప్ప చదువులు ఉండవచ్చు, నీకు ధనం ఉండవచ్చు, దూరం విషయాలు కూడా నువ్వు దర్శించగల శక్తి ఉండవచ్చు ఇవన్నీ ఉన్నప్పటికీ ఏదీ గురువు యొక్క అనుగ్రహంతో సమానంకాదు. ఇది ఫైనల్. నీ హృదయంలో ఉన్న నిజాన్ని చూపించేది గురువు అనుగ్రహం ఒక్కటే.

గురువు దయ ఎలా ఉంటుందో చెప్పమని ఒకరు భగవాన్‌ని అడిగారు. అది మాటలకి, ఊహలకి, సంకల్పానికి అతీతం. బుద్ధితోటి ఆలోచించి చెబుదామంటే ఆ దయ బుద్ధికి అతీతం. మనస్సుకి, ఇంద్రియాలకి ఆ దయ అతీతం. గురువు అనుగ్రహం ఉంది. అది మాటలకు అందదు, అందని దాని గురించి నన్ను ఎలా చెప్పమంటావు. అది అనుభవైకవేద్యం. నీ హృదయంలో చైతన్యం మేల్కొన్నప్పుడు గురువు అనుగ్రహం వలన కదా ఈ చైతన్యం నాలో మేల్కొంది, గురువు అనుగ్రహం ఇట్టిదని నీ అనుభవానికి

అందుతుంది అన్నారు. నువ్వు ఎన్ని సాధనలు చేసినా, ఎన్ని యాత్రలు చేసినా, అంతిమంగా ఆ చివరిస్థితిని, పరమస్థితిని నువ్వు చేరుకోవాలి అంటే అది ఈశ్వరుని యొక్క, గురువు యొక్క అనుగ్రహం లేకుండా నీకు సాధ్యము కాదు. ఎవ్వరికీ లేని కష్టాలు నాకు వస్తున్నాయి ఏమిటి? నాకు ఇంత దుఃఖం ఉంది ఏమిటి? అని ఇలా అనుకోకండి. మీకు సబ్జక్టు బాగా అర్థం అవుతూ ఉంటే, మీ అశాంతి అంతా శాంతిగా మారిపోతుంది. మీ దుఃఖం అంతా సుఖంగా మారిపోతుంది. మీ అప్పులు అన్నీ నిలవకింద మారిపోతాయి. వాల్మీకి రామాయణంలో ఒక మాట చెబుతాడు. రాముడిని మీరు చూడటంకాదు, రాముడిచేత మీరు చూడబడాలి అని. మన నేత్రాలు మాంసంతోటి తయారు చేసారు. రాముడి నేత్రాలు జ్ఞాననేత్రాలు. అందుచేత జ్ఞాననేత్రాలతోటి చూడబడాలి. ఇది పులినోట్లోపడ్డ మాంసపు ముక్క. అంటే ఈశ్వరుని యొక్క చూపు ఒక్కసారి నీమీద పడితే నువ్వు తరించేవరకూ ఆ దయ నిన్ను వెంటాడుతూ ఉంటుంది. ఎంత పెద్ద గడ్డిమేటు అయినా ఒక అగ్గిపుల్లకి లోకువ. అలాగే కొన్ని కోట్లాది జన్మలకి సంబంధించిన అజ్ఞానం నీ లోపల ఉన్నా, ఇంత అజ్ఞానం ఉంది ఏమిటి అని గురువు అనుకోడు. గురువు యొక్క జ్ఞాన నేత్రానికి ఇది అంతా లోకువే. మన గొప్పల కోసం కాకుండా, మన వ్యక్తీభావన కోసం కాకుండా, రాముడి అనుగ్రహం కోసం, రాముడి దయకోసమే మనం పని చేస్తూ ఉంటే చివరికి ఆ రాముడు మిగులుతాడు, మనం పోతాము. అది చివరిస్థితి, పరమస్థితి.

మీరు కష్టంలో ఉన్నప్పుడు ఎవరైనా మీకు మాట సహాయం చేసినా లేకపోతే ద్రవ్య సహాయం చేసినా, మీరు భయపడుతూ ఉంటే మేము ఉన్నాము అని అభయస్థితి ఇచ్చినా, ఎవరు ఏ రూపంలో మీకు సహాయసహకారములు అందించినా వాళ్ళపట్ల మీరు కృతజ్ఞత విడిచిపెట్టకండి. మనకి దేహము లోపల నేను అనే తలంపు ఉంది. ఈ దేహము లోపల నేను అనే తలంపు ఎవడైతే పెట్టాడో వాడి దయ లేకుండా ఆ నేను బయటకు వెళ్ళదు. నీ కుయుక్తులకి, నీ కుతంత్రాలకి, నీ జిమ్మిక్కులకి ఆ నేను బయటకు వెళ్ళదు. ఆ నేను అనే తలంపు కోసమే చుట్టరికాలు, స్నేహాలు, విరోధాలు, గొప్పలు ఆ నేను అనే తలంపుని ముస్తాబు చేయటానికే కదా గొప్పలు. మీరు చాలా గొప్పవారు అంటే ఎవరు సంతోషిస్తున్నారు. సంతోషించేది మీ శరీరం కాదు, ఆ శరీరం లోపల ఉన్న నేను అనే తలంపు. ఈశ్వరానుగ్రహం లేకుండా ఆ నేను బయటకు వెళ్ళదు. అందుచేత ఈశ్వరానుగ్రహం పొందటానికి నిరంతరం ప్రయత్నం చేయండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఆగస్టు | 21 | కృష్ణాష్టమి, జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| సెప్టెంబరు | 1 | ఐ-భీమవరం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha



**భూపతిరాజు శ్రీరామమూర్తి రాజుగారు వారి షష్టిపూర్తి సందర్భముగా సద్గురు శ్రీ నాన్నగారితో...**

# దైవ నిర్ణయంపై నిరీక్ష నేర్చుకొంటే - శరణాగతి సిద్ధిస్తుంది

జన్మజన్మల నుంచి మనం కర్తగా భావిస్తున్నాము ప్రతీ పనికి ఈ భావనే బంధకారణమౌతున్నది. దీని వల్లనే పదే పదే పుట్టవలసిన పరిస్థితి వస్తున్నది. ఈ దేహబుద్ధిని జయించాలి. తనుసాక్షిణి అనుకొంటే కళ్యాణపథం ప్రాప్తిస్తుంది. ముందు నాగతి ఏమిటి? అని ఎందుకు ఏడవటం. ఏ సందర్భంలోనూ దైవ నిర్ణయం పై వైఫల్యము పొందకూడదు. సర్వత్రా, సర్వకాలాల్లోనూ మన తండ్రియైన గురుదేవులు తప్ప మనకు ఎవరు ఉన్నారు? ఒకవేళ ఆయన శిక్షించినా మన మేలు కొరకే. మనం ఆయన సంకల్పానికి అనుగుణంగా నడిస్తే మనలను ఎందుకు శిక్షిస్తారు. రంతిదేవుడు "ఏ ప్రారబ్దం అనుభవించటానికి ఈ దేహం వచ్చిందో ఆ ప్రారబ్దమే ఈ శరీరాన్ని పోషిస్తుంది" అన్నారు. అది శరణాగతి. భగవాన్ "దైవ శక్తిని గురించి ఊరికే ఉండు ప్రతీ ఒక్కరినీ దైవమే చూచుకొంటాడు. ఎన్నో కోట్ల జనులలో నీవు ఒక్కడివి. అందరినీ చూచే ఆయన నిన్ను చూడడా? ఆయన ఇచ్ఛపై అన్నీ వదిలేయటం మంచిది. ఏపాటి తెలివి ఉన్నా దీన్ని గ్రహించవచ్చు" అన్నారు. భగవంతుడు సత్యం, భగవన్‌నిమగ్నమైన జీవితం అశుభాన్ని పొందదు. శ్రీనాన్నగారు "మీరు అనుకొన్నా అనుకోకపోయినా మీ ఇష్టాఅయిష్టాలతో సంబంధం లేకుండా అంతా ఈశ్వర ప్రణాళిక అనుసరించి జరుగుతున్నది. మీ ప్రణాళిక జరుగదు. ఆయన జీవులను ఎప్పుడు, ఎక్కడ కలుపుతాడో ఎక్కడ విడదీస్తాడో ఆయనకే తెలుసు. శరణాగతి వల్ల మీలో కంట్రోల్ వస్తుంది. సాధన చెయ్యకుండానే మనస్సు వశమౌతుంది తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం" అన్నారు. మనం పరమాత్ముని చేతుల్లో కీలు బొమ్మలము. మనం పుట్టించటానికి ముందే మన కర్మలు అన్నీ నిర్ణయించాడు. దాన్ని గురించి చింతించకూడదు. బలహీనత తప్ప మరో పాపం లేదు. ఇది అజ్ఞానం నుంచి వస్తుంది. "ఏది నిజమైనదో అది ఎప్పడో ఒకప్పుడు ఋజువు చేసుకొంటుంది" అనే నిరీక్షణ నేర్చుకోవాలి. శరణాగతికి మించిన ప్రార్థన మరొకటి లేదు. భగవంతుని పాదాలమీద భక్తి కలిగితే అవగాహనను ఆయనే ఇస్తాడు. ఆత్మశక్తితో నిరీక్షణ నేర్చుకొంటే అజ్ఞానం సిగ్గుపడిపారిపోతుంది. మనం భగవంతుణ్ణి ఇలా ప్రార్థించాలి "ధనంపైన, కామంపైన ఆశక్తిలేదు. నా పూర్వ జన్మల కర్మానుభవాన్నిబట్టి అది అలా జరుగుతుంది. జన్మజన్మలకు నీ పాదాలమీద భక్తి ఉండేలా చూడు నేను ప్రార్థిస్తాను కాని సహాయం నీవే చెయ్యాలి" అని వేదనతో అర్పణభావంతో కన్నీటితో నివేదించుకొంటేచాలు మిగిలిన పని దైవం చూచుకొంటాడు. నిజధామానికి చేరిపోతాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**